ఈనాడు
తూర్పుగోదావరి
శుక్రవారం 27 ఏప్రిల్ 2018 •• 16 పేజీలు

# సేవ చేసే అభ్యర్థులే ప్రభుత్వ ఉద్యోగాలకు రావాలి



మాట్లాడుతున్న ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్

భానుగుడి సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: సేవ చేసే అభ్యర్థులే ప్రభుత్వ ఉద్యోగాలకు రావాలని ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయభాస్కర్ అన్నారు. జేఎన్టీయూకేలో ఇంజినీరింగ్ పూర్వపు విద్యార్థుల సంఘం కాకినాడ(ఏకోశాక్) ఆధ్వర్యంలో బీటెక్, బీఫార్మసీ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు ఇండక్షన్ ప్రోగ్రాం బుధవారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏపీపీఎస్సీ ఛైర్మన్ పి.ఉదయ భాస్కర్ హాజరై మాట్లాడారు. అధ్యాపకులు కేవలం ఇంజినీరింగ్ పాఠ్యాంశాలనే కాకుండా సామాజిక బాధ్యతను నేర్పించాలని సూచించారు. ఆధునిక యుగంలో కనీస నైపుణ్యమున్న వారికి మాత్రమే ఉద్యోగావకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. నైపుణ్యాల కొరతతో ఉన్నవారికి ఉద్యోగావకాశాలు దూరమవుతాయన్నారు. గ్రూప్-1, 2ఉద్యోగాలకు 70 శాతం మంది ఇంజినీర్లు దరఖాస్తు చేస్తున్నారని, సామాజిక బాధ్యత కలిగి, సేవ చేసే తత్వం ఉన్నవారే ప్రభుత్వ ఉద్యోగాలకు రావాలని, వారే సమాజాన్ని మార్చే అవకాశం ఉంటుందన్నారు. వర్సిటీ ఇంఛార్జి ఉపకులపతి ఎస్.రామకృష్ణారావు మాట్లాడుతూ కళాశాలల్లో అధ్యాపకుల కొరత ఉందని, ఆన్‌లైన్ ద్వారానే నేర్చుకోగల అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు రెండు క్రెడిట్స్ కేటాయిస్తామన్నారు. ఇంజినీరింగ్ సిలబస్‌ను ప్రస్తుత కాలానుగుణంగా ఉపయోగపడేలా మార్చే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో రెక్టార్ కె.పూర్ణానందం, రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు, ఏకోశాక్ జనరల్ సెక్రటరీ పి.సుబ్బారావు, అధ్యక్షుడు జీవీఆర్ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి 24|7
తూర్పుగోదావరి
శుక్రవారం 27-4-2018

## నైపుణ్యాల కొరతతో ఉద్యోగావకాశాలకు దూరం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): నైపుణ్యాల కొరతతో ఉద్యోగావకాశాలు సాధించలేకపోతున్నారని, తమ లోపాలను సరిదిద్దుకుని అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే ప్రాంగణంలో బుధవారం రాత్రి ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ ఆధ్వర్యంలో బీటెక్, బీఫార్మసీ తృతీయ సంవత్సర విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉదయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ రామకృష్ణారావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ క్రీడా విభాగాలకు ఎంపిక చేసి నిరూపించుకోగలిగితే రెండు క్రెడిట్స్ కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ పూర్ణానందం, రిజిస్ట్రార్ వీవీ సుబ్బారావు ,ప్రిన్సిపల్ ప్రసాద్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## శ్రీనివాసరావుకు జేఎన్‌టీయూకే డాక్టరేట్



ఏబీ శ్రీనివాసరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): 'ఎ పజ్జీలాజిక్ అప్రోచ్ టు వార్డ్స్ డిటెక్షన్ ఆఫ్ ఐసోమార్ఫిజం, ఇన్వెర్షన్ అండ్‌రేటింగ్ ఆఫ్ కైనమెటిక్ చైన్స్' అంశంపై సిద్ధాంత వ్యాసం రచించిన వి.శ్రీనివాసరావుకు జేఎన్‌టీయూకే డాక్టరేట్ ప్రకటించింది. ఈయన తన సిద్ధాంత వ్యాసం జేఎన్‌టీయూకే రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లికార్జున రావు, శ్రీవాసవీ కళాశాల మెకానికల్ ప్రొఫెసర్ డాక్టర్ ఏబీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో సమర్పించారు. వి.శ్రీనివాసరావు ఆదిత్య సూరంపాలెం ఆదిత్య కళాశాలలో మెకానికల్ ప్రొఫెసర్, వైస్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.